పార్టీ ఫిరాయిస్తే సీటు గల్లంతే!

- అనర్హత అంశంపై సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పులు
- కీలకంగా మారిన రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలు
- ఏడాది క్రితం సీజే చంద్రచూడ్ బెంచ్ సంచలనం
- ఎమ్మెల్యే, ఎంపీ పార్టీ మారితే ఇక సీటు పోయినట్టే
- ఫిర్యాదులపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తప్పనిసరి
- లేదంటే వ్యవహారం న్యాయవ్యవస్థ పరిధిలోకి
- స్పీకర్లకు మధ్యంతర ఆదేశాలకూ చాన్స్ లేదు
- స్పీకర్ల నిర్ణయాలపై న్యాయ సమీక్ష చట్టబద్ధమే
- 'అనర్హ' ప్రజాప్రతినిధులకు ఒక్కరోజు కూడా పదవిలో ఉండే అధికారం లేదన్న సుప్రీంకోర్టు
- ఫిరాయింపులు– అనర్హత కేసుల విచారణకు ట్రిబ్యునల్ ఉండాలని పార్లమెంటుకు సూచన

న్యూఢిల్లీ, జూన్ 27 (నమస్తే తెలంగాణ): ఒక పార్టీ నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధి (ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ) మరో పార్టీలోకి దూకడం, అధికారం కోల్పోయిన పార్టీ నుంచి గెలిచి, అధికారం సాధించిన పార్టీలోకి మారడం, కండువాలు మార్చుకోవడం, కప్పదాట్లు వేయడం, స్పీకర్ సాచివేత వైఖరి, కోర్టు కేసుల వాయిదా నడుమ పబ్బం గడుపుకోవడం, పదవులు చేపట్టడం.. ఇవన్నీ ఒకప్పుడు చెల్లాయేమో కానీ, ఇప్పుడు చెల్లుబాటయ్యే అవకాశం ఎంతమాత్రమూ లేదు. సుప్రీంకోర్టు ఇటీవలి కాలంలో ఇచ్చిన కీలక తీర్పులే ఇందుకు కారణం. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను బట్టి చూస్తే, పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో నిర్ణయాన్ని స్పీకర్లు ఇక ఏండ్ల తరబడి ఎంత మాత్రం వాయిదా వేయలేరు. తప్పనిసరిగా వారు నిర్ణీత కాలవ్యవధి అంటే మూడు నెల్లోపే నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించే ఎమ్మెల్యేలపై కచ్చితంగా అనర్హత వేటు కూడా పడనున్నది. అంటే వారు తమ శాసన సభ్యత్వాన్ని కోల్పోవడం ఖాయమన్న మాట. కోరల్లేని పాములా మారిన ఫిరాయింపు నిరోధక చట్టం, పార్టీ మార్పిడులను ఆపలేక పోతున్న నేపథ్యంలో, తన ముందుకు వచ్చిన రెండు కేసులపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పులను వెలువరించింది. మణిపూర్ అసెంబ్లీ స్పీకర్ తదితరులపై కైషమ్ మేఘచంద్ర సింగ్ వేసిన తొలి కేసులో జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రామసుబ్రమణ్యంతో కూడిన ధర్మాసనం 2020 జనవరి 21న తీర్పు వెలువరించగా, మహారాష్ట్ర గవర్నర్, తదితరులపై సుభాష్ దేశాయ్ వేసిన మరో కేసులో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ షా, జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ నర్సింహతో కూడిన ఐదురుగు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. మే 11, 2023న అంటే కేవలం ఏడాది కిందట మరో తీర్పుని వెలువరించింది. పార్టీ ఫిరాయించిన ప్రజా ప్రతినిధుల విషయంలో ఏం చేయాలి? ఎలా చేయాలనే దాన్ని సుప్రీంకోర్టు ఈ తీర్పుల్లో సవివరంగా పేర్కొన్నది. 'ఎమ్మెల్యేల అనర్హత–స్పీకర్ అధికారాలు–నిర్ణయం తీసుకోవాల్సిన సమయం' గురించి రాజ్యాంగంలోని పదో షెడ్యూలు–2(1)(ఎ) సవివరంగా పేర్కొన్నదని కూడా సుప్రీం ధర్మాసనాలు స్పష్టంచేసాయి. సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో ఫిరాయింపులపై అదే లా ఆఫ్ది ల్యాండ్‌గా మారిపోయిందని, అందువల్ల అన్ని వ్యవస్థలూ దాన్నే పాటించాల్సి ఉంటుందని రాజ్యాంగ నిపుణులు పేర్కొంటున్నారు.

సుప్రీంకోర్టు ఏమన్నదంటే?

'రాజ్యాంగంలోని పదో షెడ్యూలు ప్రకారం శాసనసభ స్పీకర్ వ్యవస్థ.. ఒక ట్రైబ్యునల్ (న్యాయ ప్రాధికార సంస్థ) వంటిది. అందువల్ల ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్ల మీద వారు నిర్ణీత సహేతుక కాల వ్యవధిలో నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి. కొన్ని అసాధారణ సందర్భాలను మినహాయిస్తే, నిర్ణీత సహేతుక కాల వ్యవధి అంటే, అనర్హత దరఖాస్తు ఇచ్చిన తర్వాత గరిష్ఠంగా మూడు నెలల లోపలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది! నిబంధనలను ఉల్లంఘించి పార్టీ ఫిరాయించిన వారిపై పదో షెడ్యూలు మేరకు అనర్హత వేటు వేసి, రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలంటే, స్పీకర్ మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవడం తప్పనిసరి' అని సుప్రీం న్యాయమూర్తులు తేల్చి చెప్పారు.

'లోక్‌సభ లేదా అసెంబ్లీ కాలపరిమితి సాధారణంగా ఐదేండ్లు మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకునే, స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి 3 నెలల గరిష్ఠ పరిమితి విధించింది. రాజ్యాంగం పదో షెడ్యూల్‌లోని నిబంధనలను ఉల్లంఘించి, అనర్హతకు పాత్రులయ్యే ప్రజాప్రతినిధులకు ఒక్కరోజు కూడా ఎంపీ లేదా ఎమ్మెల్యేగా కొనసాగే హక్కు ఉండదు. రాజేంద్రసింగ్ రాణా కేసులో కూడా ధర్మాసనం ఇదే విషయాన్ని స్పష్టంచేసింది' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. అనర్హత పిటిషన్లపై మధ్యంతర నిర్ణయాలకు ఆస్కారం లేదని, తుది నిర్ణయమే వెల్లడించాల్సి ఉంటుందని కూడా ధర్మాసనం పేర్కొన్నది.

'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఒక సభ్యుడి అనర్హతపై స్పీకర్ సత్వర నిర్ణయం తీసుకోవడానికి న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలనుకుంటే కచ్చితంగా చేసుకోవచ్చు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షను కిహోటో హోలోహాన్ కేసు తీర్పు (1992)లోని 110, 111 పేరాలు ఏవిధంగానూ అడ్డుకోవడం లేదు. అనర్హతపై స్పీకర్ తుది నిర్ణయం తర్వాత న్యాయ సమీక్షకు కచ్చితంగా అవకాశం ఉన్నది. ఒకవేళ స్పీకర్ తాత్కాలిక అనర్హత, లేదా సస్పెన్షన్ చర్యలు తీసుకుంటే, కోర్టు కూడా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వవచ్చు' అని సుప్రీంకోర్టు పేర్కొన్నది.

'ఒక ప్రజా ప్రతినిధికి శిక్షపడే విధంగా స్పీకర్ నిర్ణయాలు తీసుకుంటే, ఆ వ్యక్తి చట్టసభ సభ్యత్వానికి అనర్హుడవుతాడని, ఫలితంగా సుదీర్ఘ కాలంపాటు సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వస్తుందని, దీనివల్ల ఆయనకు కోలుకోలేని నష్టం కలుగుతుందనే వాదన అసంబద్ధం. అనర్హత వల్ల అతనికి జరిగే నష్టం కంటే, అనర్హుడైన వ్యక్తిని చట్టసభ సభ్యుడిగా కొనసాగిస్తే, ఆ నియోజకవర్గ ప్రజలపై తీవ్ర విపరిణామాలు ఉంటాయి.. అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

మణిపూర్‌లో ఏం జరిగిందంటే?

2017 ఏప్రిల్‌లో మణిపూర్‌లోని ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పిటిషన్ ఇచ్చింది. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ ఖేమ్‌చంద్ మూడేండ్లపాటు తాత్సారం చేశారు. ఫిరాయించిన వారిలో ఒకరు (శ్యామ్‌కుమార్) మంత్రి పదవి కూడా పొందారు. తరువాత 2020లో రాజ్యసభ ఎన్నిక సందర్భంగా ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో నలుగురు మళ్లీ కాంగ్రెస్‌లోకి జంప్ చేశారు. దాంతో గతంలో కాంగ్రెస్ ఇచ్చిన పిటిషన్ ఆధారంగా స్పీకర్ వారిపై అనర్హత వేటు వేశారు. మిగతా ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ రాజ్యసభ అభ్యర్థికి ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కైషమ్ మేఘచంద్ర సింగ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ కేసును వాదించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ స్పందించకపోవడాన్ని, ఫిరాయించిన ఎమ్మెల్యేలను మంత్రులుగా నియమించడాన్ని సిబల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం కీలకమైన ఆదేశాలను వెలువరించింది. 'మణిపూర్ అసెంబ్లీ కాలపరిమితి మరో రెండేండ్లలోనే ముగియనుంది. అందువల్ల ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్, మేం ఈ తీర్పు ఇచ్చిన నాలుగు వారాల్లోనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ స్పీకర్ అలా చేయకుంటే మీరైనా, ఎవరైనా నిరభ్యంతరంగా సుప్రీంకోర్టుకు రావచ్చు. అప్పుడు దాని సంగతి మేం చూసుకుంటాం' అని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అనడమే కాదు, చర్యలు తీసుకొని చూపించింది కూడా! సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా నాలుగు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో సుప్రీంకోర్టు శ్యామ్‌కుమార్‌ను మంత్రి పదవి నుంచి తొలగించింది. అతను అసెంబ్లీలో కాలు పెట్టకూడదని ఆదేశించింది. అనర్హత పిటిషన్లపై నిర్దేశిత గడువులోపు స్పీకర్ స్పందించకపోయినా, తమ ఆదేశాలను బేఖాతరు చేసినా, తానే స్వయంగా జోక్యం చేసుకుని, నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని సుప్రీంకోర్టు ఈ చర్యతో విస్పష్టమైన సంకేతాలు పంపింది.

న్యాయ సమీక్ష రాజ్యాంగ విరుద్ధమా?

అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారం ఎవరిదన్న విషయంలో సుప్రీంకోర్టు తన తీర్పుల్లో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చింది. రాజ్యాంగం ప్రకారం శాసన వ్యవస్థ వేరు, న్యాయ వ్యవస్థ వేరు. శాసన వ్యవస్థ (స్పీకర్) అధికారాల్లో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోలేదనే వాదనను సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

● ఫిరాయింపులపై ట్రిబ్యునల్ వేయాలి

ఫిరాయింపులు, అనర్హత పిటిషన్లపై స్పీకర్లు సత్వరమే నిర్ణయాలు తీసుకోకపోవడం, లేదా పక్షపాతపూరితంగా నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం భారత ప్రభుత్వానికి కొన్ని సూచనలు కూడా చేసింది. 'ప్రత్యక్షంగానో, పరోక్షంగానో స్పీకర్ కూడా ఒక రాజకీయ పార్టీకి చెందినవాడే. అందువల్ల ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపే బాధ్యతను స్పీకర్లకు అప్పగించాలా, వద్దా అనే విషయంలో పార్లమెంటు పునరాలోచన చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

ఎమ్మెల్యేల అనర్హత వివాదాలపై విచారణ వ్యవహారాన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్పీకర్లకు అప్పగించే బదులు ఏదైనా ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటుచేసేలా రాజ్యాంగాన్ని సవరించే విషయాన్ని పార్లమెంటు సీరియస్‌గా పరిశీలించాలి. ఈ అనర్హతలకు సంబంధించిన వివాదాలకు మధ్యవర్తిగా రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో శాశ్వత ట్రిబ్యునల్ లేదా మరేదైనా బయటి స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. తద్వారా మన ప్రజాస్వామ్యం సక్రమంగా పనిచేయడంలో అత్యంత కీలకమైన పదో షెడ్యూలులోని నిబంధనలకు బలం చేకూర్చినట్టవుతుంది'' అని ధర్మాసనం హితవు చెప్పింది.

'రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం ఒక సభ్యుడి అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్, లేదా మండలి చైర్మన్‌కే ఉంటుందన్న మాట నిజమే. అయితే అదే పదో షెడ్యూలు, స్పీకర్‌ని ట్రైబ్యునల్ (ప్రత్యేక న్యాయ ప్రాధికార సంస్థ)గా పరిగణించిందని కిహోటో హోలోహాన్ కేసులో ధర్మాసనం తీర్పు చెప్పింది. దాని ప్రకారం రాజ్యాంగంలోని పదో షెడ్యూలు ఆధారంగా తీసుకునే నిర్ణయాలు కచ్చితంగా కోర్టుల అధికార పరిధి (జ్యూరిస్‌డిక్షన్)లోకి, అంటే న్యాయ సమీక్ష పరిధిలోకి వస్తాయి. రాజ్యాంగంలోని 136, 226, 227 అధికరణాలు నిస్సందేహంగా దీన్నే రుజువు చేస్తున్నాయి' అని ధర్మాసనం విస్పష్టంగా వివరించింది.

అనర్హత పిటిషన్లపై సంబంధిత వ్యవస్థల (స్పీకర్ లేదా చైర్మన్) కంటే ముందే, మొట్టమొదటగా తామే (న్యాయవ్యవస్థ) నిర్ణయం తీసుకోవడం సరికాదని, స్పీకర్ చట్టప్రకారం సరైన నిర్ణయం తీసుకోవడానికి తాము అవకాశం ఇస్తామని, అయితే స్పీకర్ ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దానిపై ఎవరైనా అప్పీలు చేస్తే, దాన్ని సమీక్షించి, తగు ఆదేశాలు ఇవ్వడానికి తాము సిద్ధమని వెల్లడించింది. అదే సమయంలో కొన్ని సంక్లిష్ట వాస్తవాలు, పరిస్థితుల్లో అనర్హత పిటిషన్ల న్యాయబద్ధతను తాము నిర్ణయిస్తామని అత్యున్నత న్యాయస్థానం వివరించింది. ఆ సందర్భాలు ఏమిటో కూడా వివరించింది. అవేమిటంటే...

1. **ఒక సభ్యుడి అనర్హత పిటిషన్‌పై నిర్ణీత కాలవ్యవధిలో నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ విఫలమైతే**
2. **పిటిషన్ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే అనర్హుడా కాదా అనేది ముందుగా నిర్ణయించకుండా, స్పీకర్ పార్టీలో చీలిక గురించిన నిర్ణయాన్ని తీసుకుంటే..**
3. **అనర్హత పిటిషన్లపై నిర్ణయాన్ని మూడేండ్లకు మించి స్పీకర్ పెండింగ్‌లో పెట్టడం, తద్వారా త్వరలో రాష్ట్ర శాసనసభ కాల పరిమితి ముగిసే పరిస్థితి ఉన్న కారణంగా పిటిషన్లపై సత్వర నిర్ణయం తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడడం.**

ఈ మూడు సందర్భాల్లో అనర్హత పిటిషన్లపై అధికారిక ప్రక్రియను, నిర్ణయాధికారాన్ని స్పీకర్‌కు అప్పగించడం వల్ల అనర్హత పిటిషన్లు నిరుపయోగం అవుతాయని, అందువల్ల అలాంటి సందర్భాల్లో అనర్హత పిటిషన్లను న్యాయ వ్యవస్థే తేలుస్తుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తన అధికార పరిధిని వినియోగించడంలో స్పీకర్ విఫలం కావడం వల్ల పదో షెడ్యూలులోని 6వ పేరాలో ఉన్న రాజ్యాంగ రక్షణ ఆయనకు వర్తించదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అనర్హత పిటిషన్‌ను సహేతుకమైన గడువులోగా పరిష్కరించకుండా స్పీకర్ దూరంగా ఉన్నప్పుడు, ఆ అంశం సూమోటోగానే న్యాయవ్యవస్థ అధికార పరిధిలోకి వెళ్లిపోతుందని సుప్రీంకోర్టు తీర్పులో ఉన్నది.

వేర్పాటు, చీలిక, విలీనంపై..!

ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేలు విడతల వారీగా బయటపడటం, మరో గ్రూపుగా ఏర్పడటం, తర్వాత ఇంకో పార్టీలో విలీనం కావడం గురించి కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో అస్పష్టకరమైన సందర్భాలను ప్రస్తావించింది. 'చీలిక–కొత్త శిబిరానికి గుర్తింపు–స్పీకర్ నిర్ణయాధికారం' గురించి కీలక వ్యాఖ్యలు చేసింది. అనర్హత పిటిషన్ల సంగతి తేల్చిన తర్వాతే మిగతా వ్యవహారాల గురించి పరిశీలించాలని చెప్పకనే చెప్పింది. 2003లో సమాజ్‌వాదీ నేత ములాయంసింగ్ యూపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి చెందిన కొందరు ఎమ్మెల్యేలను ఆయన తనకు మద్దతిచ్చేట్టు చేసుకున్నారు. తర్వాత మరో 13 మంది బీఎస్పీ ఎమ్మెల్యేలను కూడా ఆకట్టుకున్నారు. వీరందరిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ రాజేంద్రసింగ్ రాణాకు అప్పటి బీఎస్పీ నేత స్వామిప్రసాద్ మౌర్య ఫిర్యాదు చేశారు. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం ఏడాది క్రితం ఇచ్చిన తీర్పులో ఈ ఉదంతాన్ని ప్రస్తావించింది. '26.8.2003 నాడు స్పీకర్ బీఎస్పీలో చీలికను ఆమోదిస్తూ, లోక్‌తాంత్రిక్ బహుజన్ దళ్ పేరుతో ప్రత్యేక గ్రూపుగా గుర్తింపును ఇచ్చారు. ఆ తర్వాత మరో 13 మంది ఎమ్మెల్యేలు బీఎస్పీని వీడారు. వీరిపై 4.9.2003న అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. తర్వాత ఈ 13 మంది ఎమ్మెల్యేలు కూడా లోక్‌తాంత్రిక్ బహుజన్‌దళ్ గ్రూపులో చేరారు. అనంతరం మొత్తం గ్రూపు సమాజ్‌వాది పార్టీలో విలీనమైంది. అయితే 13 మంది ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండానే స్పీకర్, ఈ విలీనాన్ని 6.9.2003న ఆమోదించారు. ఆ మరుసటి రోజున ఆయన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను తిరస్కరించారు. దీనిపై హైకోర్టును బీఎస్పీ ఆశ్రయించింది. దీంతో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఎమ్మెల్యేల మీద దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ విచారించాల్సిందేనని స్పష్టంచేసింది. తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ఆదేశించింది. తద్వారా అనర్హత పిటిషన్లను విచారించి నిర్ణయాన్ని వెలువరించిన తర్వాతే, చీలిక గ్రూపుకు గుర్తింపు, ఇతర పార్టీల్లో విలీనం వంటి అంశాలను చేపట్టాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

3 నెలల్లో తేల్చాల్సిందే!

మొదటిపేజీ తరువాయి...

కోరారు. ఇందుకు అనుమతించిన హైకోర్టు భోజన విరామం తర్వాత విచారణ చేపట్టింది. అయితే, అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి కల్పించుకొని, విచారణను వాయిదా వేయాలని కోరారు. హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేందర్‌గుప్త మృతికి ఫుల్‌కోర్టు సంతాపం తెలుపనున్నదని కూడా ఏజీ చెప్పారు. పిటిషన్ల విచారణకు మరో తేదీని నిర్ణయించాలని కోరారు. ఈ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేసు విచారణ జరిపేందుకే న్యాయమూర్తి నిర్ణయం తీసుకోవడంతో.. కోర్టు హాల్ నుంచి ఏజీ వెళ్లిపోయారు.

స్పీకర్‌కు ఆదేశాల జారీ ఎలా?

ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా స్పీకర్ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిందని సుందరం మరోసారి గుర్తు చేశారు. ఈ దశలో న్యాయమూర్తి కల్పించుకొని.. స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసేందుకు వీలు లేదని అడ్వొకేట్ జనరల్ గత విచారణలో చెప్పారని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఏ విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవచ్చునో వివరించాలన్నారు. ఈ నేపథ్యంలో న్యాయవాది ఆర్యమ సుందరం తిరిగి వాదనలు వినిపించారు. శివసేన కేసు, మణిపూర్ ఎమ్మెల్యేల కేసు, రాజేంద్రసింగ్ రాణా కేసులను ఉదహరించారు. ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలని, అలా తీసుకోని పక్షంలో పిటిషినర్లు తిరిగి కోర్టుకు రావచ్చని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. రాజ్యాంగంలోని 142 అధికరణం కింద సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. తద్వారా స్పీకర్‌కు ఆదేశాల జారీకి వీలున్నట్టు స్పష్టం అవుతున్నదని పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రకారం నడుచుకోవాల్సిన స్పీకర్, ఆ విధంగా వ్యవహరించకపోతే రాజ్యాంగ రక్షణ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయవచ్చునని సుందరం తెలిపారు. ఈ ఉత్తర్వులు స్పీకర్‌కు వ్యక్తిగతంగా ఇచ్చినట్లు అవ్వదని, స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేయాలని వివరించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరాల్సిందిగా కాంగ్రెస్ పిలుపు ఇవ్వడాన్ని కూడా కోర్టు పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రూల్స్ ప్రకారం స్పీకర్ నడుచుకోలేదు

ఒక పార్టీ మ్యానిఫెస్టో ఆధారంగా గెలుపొంది మరో పార్టీలో చేరడం ప్రజా తీర్పును కాలరాయడమేనని సుందరం అన్నారు. సుప్రీంకోర్టు, బాంబే హైకోర్టుల తీర్పుల ప్రకారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన చట్ట సభ సభ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని చెప్పారు. అయితే ఫిర్యాదు చేసి మూడు నెలలు దాటినా ఇప్పటివరకు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు కూడా ఇవ్వలేదని సుందరం తప్పుపట్టారు. అసెంబ్లీ రూల్స్ 6, 7 ప్రకారం స్పీకర్ వ్యవహరించడం లేదన్నారు. అసెంబ్లీ రూల్ 6 ప్రకారం స్పీకర్ తన ముందున్న ఫిర్యాదుపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నారో సత్వరమే ఆ కాపీని కూడా స్పీకర్ కార్యాలయం అందజేయాలని చెప్పారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని మార్చి 18న బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారని చెప్పారు. అయినా చర్యలు లేకపోవడంతో ఏప్రిల్ 10న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని వివరించారు. ఇప్పుడు జూన్ 27 వచ్చిందన్నారు. ఇప్పుడు కూడా కౌంటర్‌గా పిటిషన్ వేశారే తప్ప ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు కూడా జారీ చేయలేదని చెప్పారు. ఇది స్పీకర్ కార్యాలయం కాలయాపన కాకపోతే ఏమిటని ప్రశ్నించారు. రూల్ 7 (3–బి) ప్రకారం 7 రోజుల్లోగా ఫిర్యాదుపై సంతృప్తి చెందిందీ లేనిది చెప్పాలని, ఈ నిబంధన కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని 226 అధికరణం కింద హైకోర్టు స్పందించాలని కోరారు. అసెంబ్లీ రూల్స్ 6, 7 ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేయవచ్చునని తెలిపారు.

పుణ్యకాలం పూర్తవుతుంది

ఎమ్మెల్యేల పదవీ కాలం ఐదేండ్లని, తీరుబడిగా, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కాలాతీతం చేస్తూ స్పీకర్ స్పందించకపోతే పుణ్యకాలం పూర్తవుతుందని సుందరం ఆందోళన వ్యక్తం చేశారు. స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోకుండా తన వద్దనే పిటిషన్‌ను పెట్టుకుంటే అది ఫిరాయింపులను ప్రోత్సహించడమే అవుతుందని చెప్పారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు నిర్ధారణ అయి మూడు నెలలు దాటినా ఇంకా నోటీసులు ఇవ్వలేదంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. మూడు నెలల వారం రోజులకు హైకోర్టులో కౌంటర్ వేశారని తెలిపారు. తప్పుడు అభియోగాలు చేశామని చెప్పడం వాస్తవం కాదని చెప్పారు. ప్రజా తీర్పుకు విరుద్ధంగా పార్టీ ఫిరాయిస్తే ఏమీ కాదనే ధీమా ప్రజాప్రతినిధుల్లో బలపడకూడదని పేర్కొన్నారు. దీనివల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెప్పారు. ప్రజలు ఓటుతో ఇచ్చిన తీర్పుకు అర్థం ఉండాలంటే ఫిరాయింపు సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఆలస్యం అయ్యిందని, పార్టీ ఫిరాయింపుదారులు చట్టసభల్లో సభ్యులుగా ఒక్కరోజు కూడా కొనసాగేందుకు అర్హత ఉండకూడదని అన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్ట నిబంధనలను అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరో ఎమ్మెల్యే లేదా ఎంపీ పార్టీ ఫిరాయించేందుకు భయపడాలని చెప్పారు. ప్రతివాదుల తరపున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి కల్పించుకుని, పిటిషన్‌కు విచారణ అర్హత లేదని, దీనిపై వాదనలు వినిపిస్తామని చెప్పారు. అయితే.. ఈ కేసును పదే పదే వాయిదా వేయబోమని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. తదుపరి విచారణను జూలై 3వ తేదీకి వాయిదా వేశారు.

మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలి

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సీ ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అనర్హత ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్ తరపున ఈ ఏడాది మార్చిలో స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని, అయినా ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదని ఆయన గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్ పార్టీ ఫిరాయించడమే కాకుండా, తన పదవికి రాజీనామా చేయకుండానే సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల్లో ఇది దారుణమైన విషయమని అభివర్ణించారు. ఈ పరిస్థితుల్లో కూడా స్పీకర్ స్పందించి, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనకు కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని తెలిపారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం 'ట్రిబ్యునల్'గా వ్యవహరించి స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని, అది స్పీకర్ రాజ్యాంగ విధి అని చెప్పారు. తన ముందున్న ఫిర్యాదుపై స్పీకర్ చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తే రాజ్యాంగ వ్యవస్థలైన హైకోర్టు, సుప్రీంకోర్టులు స్పందించాలని ఆర్యమ సుందరం కోరారు.

కండువా మార్చుకుంటే ఖతమే

- నాటి పరిస్థితికి, నేడు జరిగేదానికి పోలికేది?
- ఆనాడు తెలంగాణను అస్థిరపరిచే కుట్రలు
- దాన్ని తిప్పికొట్టేందుకే బీఆర్ఎస్‌లోకి చేరికలు
- ప్రస్తుతం ఫిరాయింపులపై సుప్రీంకోర్టు కఠినవైఖరి

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపులను ప్రోత్సహించడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై ఒకవైపు సొంత పార్టీలోనే ఆగ్రహ జ్వాల రేగుతుండగా, మరోవైపు కాంగ్రెస్ ముఖ్య నేతలు 'కాలం చెల్లిన' కారణాలు చెప్పి తమ పనులను సమర్థించుకోజూస్తున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఆనాడు బీఆర్ఎస్ చేర్చుకోలేదా? ఇప్పుడు మేం చేర్చుకుంటే తప్పేమిటి? అని లాజిక్‌లు లాగుతున్నార